క్లుప్తంగా

నేడు రొంపిచెర్లలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

రొంపిచెర్ల: రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం రొంపిచెర్ల మండలంలోని గానుగచింత, మోటుమల్లెల, బోడిపాటివారిపల్లె గ్రామ పంచాయతీల్లో పర్యటించనున్నారని పీఏ మునితుకారం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు గానుగచింత, మధ్యాహ్నం 12 గంటల నుంచి 5 గంటల వరకు మోటుమల్లెల, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు బోడిపాటివారిపల్లె గ్రామ పంచాయతీల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. 4వ తేదీ బండకిందపల్లె, పెద్దగొట్టిగల్లు, బొమ్మయ్యగారిపల్లె, 5న రొంపిచెర్ల, జాండ్లవారిపల్లె, పెద్దమల్లెల, చిచ్చిలివారిపల్లె, చెంచెంరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో పర్యటిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరై మంత్రి పెద్దిరెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

నిర్వాణ నారాయణస్వామికి ప్రత్యేక పూజలు



పలమనేరు: పట్టణ సమీపంలోని విష్ణుపురి నిర్వాణ నారాయణ స్వామి ఆలయంలో ద్వాదశి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, విష్ణుసహస్రనామ పారాయణం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

చెరుకు తోట దగ్ధం రూ.1.20 లక్షల నష్టం



రొంపిచెర్ల: మండలంలోని పెద్దగొట్టిగల్లు పంచాయతీ మేకలవారిపల్లెలో గురువారం రైతు ప్రభాకర్‌రెడ్డికి చెందిన చెరుకు తోట దగ్ధమై సుమారు రూ.1.20 వేలు నష్టం వాటిల్లింది. బాధితుని కథనం మేరకు .. ప్రభాకర్‌రెడ్డి రెడ్డి చెరువు కింద ఎకరా పొలంలో చెరుకు పంట సాగు చేశారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఉన్నట్లుండి తోటలో మంటలు చెలరేగాయి. చుట్టు పక్కల ఉన్న రైతులు వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయినా తోట పూర్తిగా కాలి పోయింది. పంట చేతికి వచ్చే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తోటకు నిప్పంటించి ఉంటారని, సుమారు.1.20లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు విలపించారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

నేడు ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక

రామకుప్పం: మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ, రెండవ వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. ఏడాది కిందట ఎంపీపీ శాంతికుమారి అనారోగ్యంతో మృతి చెందడంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రత్యేక అధికారి కె.పురుషోత్తం ఆధ్వర్యంలో ఎంపీపీ, రెండవ వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 16 మంది సభ్యులు ఉండగా, శాంతకుమారి మృతి చెందారు. మిగిలిన 15మంది ఎంపీటీసీ సభ్యులు కూడా వైఎస్సార్ సీపీ మద్దతుదారులే.

నేడు గృహ సారథులకు శిక్షణ

సోమల: నూతనంగా నియమించిన గృహ సారథులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సచివాలయాల మండల కన్వీనర్ రాశెట్టి మధు తెలిపారు. సదుం మార్గంలోని డాక్టర్ వేంకటేశ్వరరావు కోళ్ల ఫారం వద్ద ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం



కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన నీలిమ రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి కేరాఫ్ జగనన్న ప్రభుత్వం



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశానికే ఆదర్శంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. గురువారం మండలంలోని ముదరందొడ్డి పంచాయతీలోని బాలింత్రాలబండ, వీజీతోపు, మద్దిమాకులపల్లె, చింతకాయల బండ గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 413 గడపలకు వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని అంకెలతో సహా వివరించి సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందించారు. అయా గ్రామస్తులు విన్నవించిన స్థానిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్థానిక నాయకులు, అధికారులకు సూచించారు.

కరోనా సమయంలో ఎక్కడున్నావ్ లోకేష్

కరోనా మహమ్మారి అల్లకల్లోలంలోకి నెట్టి ప్రజలు విలవిలలాడుతుంటే 'నువ్వు, మీ నాన్న చంద్రబాబు ఎక్కడ ఉన్నారు లోకేష్' అని ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రశ్నించారు. కరోనా సమయంలో మీరు హైదరాబాద్‌లో కూర్చుని ఇప్పుడు యువగళం అంటూ వచ్చి ప్రభుత్వంపై బురదచల్లితే ప్రజలు నమ్మేస్తారా..? కనీసం తెలుగు సరిగా మాట్లాడలేని 'నీ అజ్ఞాన ప్రసంగాలను విని జనం నవ్వుకుంటున్నారు' అని వెంకటేగౌడ పేర్కొన్నారు. వి.కోటలో పర్యటించిన లోకేష్‌కు కనీసం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, తాత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించాలన్న జ్ఞానం కూడా లేదని విమర్శించారు.

టీడీపీని జనం నమ్మే పరిస్థితి లేదు: జెడ్పీ చైర్మన్

గతంలో చంద్రబాబు ప్రజలకు హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత గాలికి వదిలేసిన సంగతిని ప్రజలు మరచిపోలేదని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారిపోయిందన్నారు. 2024లో అవకాశం ఇవ్వాలని లోకేష్‌ను జనం మీదకు రుద్దితే మరోసారి నమ్మి మోసపోవడానికి సిద్ధంగా లేరని పేర్కొన్నారు. హామీలను తూచా తప్పకుండా నెరవేర్చడం జగనన్నకే సాధ్యమన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికీ రూ. లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ లబ్ధి చేకూరిందని తెలిపారు. కులం, మతం, రాజయాలకు తావివ్వకుండా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జగనన్న అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన తెలిపారు. ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ లక్షణ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, మండల కన్వీనర్ బాలగురునాథ్, కిషోర్ రెడ్డి, సర్పంచ్ దామోదరంరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ బాలాజీ, అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ లబ్ధి



సజ్జలపల్లెలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: ఇంటింటికీ సంక్షేమ లబ్ధి అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. గురువారం కుప్పం మండలం గరిగచీనేపల్లె, సజ్జలపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 210 ఇళ్లకు వెళ్లి మూడేళ్లలో ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని వివరించి, సంక్షేమ బావుటా కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు, నాయకుల సిఫార్సులు లేనిదే పథకాలు వచ్చేవి కావన్నారు. ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా పథకాలు ఇళ్లను వెతుక్కుంటూ వస్తున్నాయని తెలిపారు. గతంలో మాదిరి మండల కేంద్రంలోని కార్యాలయాలు, నాయకుల చుట్టూ తిరిగే పని లేకుండా ఆ గ్రామంలోని సచివాలయాల్లోనే ప్రజలకు అన్ని సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు కేవలం 600 ఇళ్లను మాత్రమే మంజూరు చేశారని, తమ ప్రభుత్వ హయాంలో ఇప్పటికే 4 వేల ఇళ్లకు పైగా మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులందరికీ పెన్షన్లు, రేషన్‌కార్డులు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ సభ్యుడు శరవణ, నాయకులు హెచ్‌ఎం మురుగేష్, అన్నాదొరై, చిన్నదొరై, రవి, శీను తదితరులు పాల్గొన్నారు.

పథకాల లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ పరిశీలకుడు వెంకటాచలపతి, పక్కన కార్యదర్శి పెద్దిరెడ్డి

పుంగనూరు: ప్రభుత్వ పథకాల లబ్ధి, వైస్సార్ సీపీ విధి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరిచాలని సచివాలయ గృహ సారథులకు పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి పిలుపునిచ్చారు. గురువారం సచివాలయ గృహ సారథుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయనతో పాటు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి , మండల సచివాలయ కన్వీనర్ కొత్తపల్లె చెంగారెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వెంకటాచలపతి మాట్లాడుతూ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందిందన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలందరికీ అందించినట్లు పేర్కొన్నారు. సచివాలయ పరిధిలో గృహసారథులు తమకు కేటాయించిన 50 గృహాలను తరచూ సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పార్టీ కోసం పని చేసే గ్రామ సారథులకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. పార్టీ పటిష్టత కోసం పనిచేసే వారికి బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అధిక మెజారిటీతో గెలిపించే బాధ్యతను గ్రామ సారథులు క్రమశిక్షణతో చేపట్టాలని పిలుపునిచ్చారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని అభివృద్ధి కార్యక్రమాలు ఇక్కడ జరుగుతున్నాయని తెలిపారు. పథకాల అమలులో పుంగనూరు ఆదర్శంగా ఉందని తెలిపారు. పార్టీ పటిష్టత కోసం గ్రామ సారథులు సైనికుల్లా పని చేయాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి, మాజీ ఎంపీపీ నరసింహులు, ఏఎంసీ మాజీ చైర్మన్ అమరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, విజయభాస్కర్‌రెడ్డి, రమణ, ప్రభాకర్‌నాయక్, సుధాకర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నంజుండప్ప, రామకృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సురేంద్రరెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై గంగాధరుని విహారం



పలమనేరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శివపార్వతులు గజవాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం గ్రామోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు ఉంటుందని ఆలయ ఈవో తెలిపారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్

రామకుప్పం: మండలంలోని బల్ల జెడ్పీ హైస్కూల్‌లో గురువారం విజలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో స్పర్శ కార్యక్రమం కింద కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరికైనా శరీరంపై స్పర్శలేని మచ్చలు, కాళ్లు, చేతివేళ్లలో బలహీనత, శరీరంలో ఎరుపురంగుతో కూడి ఉబ్బినట్టుగా మచ్చలు ఉన్నట్లయితే వెంటనే పీహెచ్‌సీలో పరీక్షలు చేసుకోవాలన్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులకు ఎండీటీ ద్వారా చికిత్సను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న సీడీపీఓ అరుణశ్రీ

రామకుప్పం: మైనర్లకు వివాహం చేస్తే నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణశ్రీ తెలిపారు. గురువారం మండలంలోని విజలాపురం హైస్కూల్‌లో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098 హెల్ప్ నంబరుకు సమాచారం అందించాలని తెలిపారు. విద్యార్థినులు సెల్‌ఫోన్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ జయంతి, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ రైతుకు నాగార్జున వర్సిటీ ఆహ్వానం



జగదీష్‌రెడ్డి

బంగారుపాళెం: మండలంలోని దండువారిపల్లెకు చెందిన ఆదర్శ రైతు జగదీష్‌రెడ్డిని గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆహ్వానించింది. గురువారం ఆయనకు ఆహ్వాన లేఖ అందింది. ఈ నెల 23, 24న ప్లాంటియన్స్ ఇన్ ప్లాంట్ అండ్ మైక్రోబయల్ రీసెర్స్–2023పై జాతీయ సదస్సు నాగార్జున వర్సిటీ నిర్వహిస్తోందని, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై ఆ సదస్సులో తాను ప్రసంగించనున్నట్లు జగదీష్‌రెడ్డి తెలిపారు.

ప్రారంభానికి సిద్ధమైన ప్రభుత్వ భవనాలు



రొంపిచెర్లలో ప్రారంభానికి సిద్ధంగా ఆర్‌బీకే భవనం



రొంపిచెర్లలో పూర్తయిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

రొంపిచెర్ల: మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయ భవనాలు ప్రారంభానికి సిద్ధం అయ్యాయి. రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండలంలో ఈ నెల 3వ తేదీ నుంచి 5 వరకు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఈ భవనాలను ప్రారంభించనున్నారు. రొంపిచెర్ల, చిచ్చిలివారిపల్లె, బొమ్మయ్యగారిపల్లె పంచాయతీల్లో రూ.62 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలను, చిచ్చిలివారిపల్లె, రొంపిచెర్లలో రూ.41 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించనున్నారు. పాత పేట, చిచ్చిలివారిపల్లెలో రూ.40 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనాలను ప్రారంభిస్తారు. గానుగచింత నగిరి, దద్దాలవారిపల్లె, చల్లావారిపల్లె, శ్రీనాథపురంకాలనీ, నడింపల్లె, షాదీమహల్, లక్ష్మీ నారాయణ కాలనీ, చెంచెంరెడ్డిగారిపల్లె, రావిళ్లవారిపల్లెలో రూ. 90 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్లను మంత్రి ప్రారంభించనున్నారు.

మహిళా సంఘాల కోసమే మైక్రోసాఫ్ట్ బ్రాంచ్

పలమనేరు: పలమనేరు మండలంలోని గ్రూపు మహిళల సేవల కోసమే ప్రత్యేకంగా ఇండియన్ బ్యాంకు వారు మైక్రోసాఫ్ట్ బ్రాంచ్‌ని ఏర్పాటు చేశారని డీఆర్‌డీఏ పీడీఎం తులసి పేర్కొన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ శేషగిరిరావుతో కలసి గురువారం ఆమె స్థానిక బ్రాంచ్‌ని సందర్శించారు. ఈ బ్రాంచ్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రుణాలను గ్రూపు సభ్యులు సకాలంలో చెల్లించాలని తెలిపారు.



బ్రాంచ్‌ని పరిశీలిస్తున్న పీడీఎం, లీడ్‌బ్యాంకు మేనేజర్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీడీఓ సుధాకర్

చౌడేపల్లె: జగనన్న కాలనీల్లో పక్కా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు తెలిపారు. గురువారం చౌడేపల్లె టౌన్‌లో సర్పంచ్ వరుణ్ భరత్, ఎంపీడీఓ సుధాకర్, సచివాలయ అధికారులతో కలిసి ఇళ్ల లబ్ధిదారులతో సమావేశమయ్యారు. పంచాయతీ పరిధిలో 235 మందికి గృహాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 64 గృహాలు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. పనులను వేగవంతం చేయాలని, బిల్లులు సకాలంలో చెల్లిస్తారని పేర్కొన్నారు. ఉపాధిలో అదనంగా 90 పని దినాలు ఇంటి నిర్మాణ పనులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ ఈఓ సుధాకర్ రావు, ఉపసర్పంచ్ అల్తాఫ్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ భూపతి, పంచాయతీ కార్యదర్శి జగదీశ్వర్ తదితరులున్నారు.

ఐఆర్‌ఎం కళాశాలలో ఫ్రాన్స్ దేశస్తులు



కళాశాలలో ఫ్రాన్స్ దేశస్తులు

కుప్పం: కుప్పం పట్టణంలోని ఐఆర్‌ఎం విద్యాసంస్థలను గురువారం ఫ్రాన్స్ దేశస్తులు సందర్శించారు. ఫ్రాన్స్ దేశం విద్యావేత్త ఫ్రాక్ లియో ఆధ్వర్యంలో బోధనా పద్ధతులపై కళాశాల చైర్మన్ దయానిధితో సమీక్షించారు. విదేశాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను వారు నివృత్తి చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

గంగవరం: మండలంలోని వెలుగు మహిళా సమాఖ్య కార్యాలయంలో నాలుగు మండలాల సంఘమిత్రలకు ఆర్థిక అక్షరాస్యతపై గురువారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. గంగవరం, పలమనేరు, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె మండలాల మహిళా సంఘమిత్రలు శిక్షణకు హాజరయ్యారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పథక సంచాలకులు తులసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆరు రోజులు పాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. ప్రధానంగా పొదుపు సంఘాల నిర్వహణ, రుణాలు ఏ విధంగా ఖర్చు పెట్టాలి, రుణాలను జాగ్రత్తగా వాడుకునే విధానం, వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా ఎలా ఎదగాలి, ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితరాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఏరియా కోఆర్డినేటర్ హరినాథ్, సంఘమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

రూ.40 వేల ఉపాధి మొక్కల మాయం



సామాజిక తనిఖీ సమావేశంలో మాట్లాడుతున్న పీడీ గంగాభవానీ

- మళ్లీ నాటాలని అధికారుల ఆదేశం
- సమావేశానికి ఎస్సార్పీ గైర్హాజర్

పలమనేరు: మండలంలో గతేడాది ఉపాధి హామీ కింద రూ.32లక్షల పనులు జరగ్గా, విచారణ చేసిన సామాజిక తనిఖీ బృందం రూ.41 వేలు అక్రమాలు జరిగినట్లు తేల్చింది. రూ.40 వేల ఉపాధి మొక్కలు మాయమైనట్లు గుర్తించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి మండలంలో 1-4-2021 నుంచి 31-3-2022 దాకా జరిగిన 900 పనులకు సంబంధించి ఖర్చుచేసిన మొత్తం రూ.32 లక్షలపై ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం బహిరంగ సభ నిర్వహించారు. డ్వామా పీడీ గంగాభవాని, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మన్ పద్మజ హాజరయ్యారు. మండలంలో జరిగిన పనులను వారం రోజులు సోషల్ ఆడిట్ సభ్యులు ఆయా గ్రామాల్లో విచారించి జరిగిన అక్రమాల నివేదికను అధికారులు వెల్లడించారు. కేవలం నాటిన మొక్కలు మాత్రమే అక్కడక్కడా కనిపించడం లేదని ఆ నివేదికలో తెలిపారు. ఓపెన్‌ఫోరంలో ఈ అక్రమాలపై స్పందించిన అధికారుల బృందం మళ్లీ మొక్కలు నాటించాలని ఆదేశించి సమావేశాన్ని ముగించారు. విచారణ బృందానికి నాయకత్వం వహించి న ఎస్ఆర్పీ రామారావు సమావేశానికి హాజరు కాకపోవడం విశేషం. ఈ సమావేశంలో ఎంపీపీ గీత, ఎంపీడీవో విద్యాసాగర్, విశ్వనాథ రెడ్డి, ఏపీవోలు పుష్పలత, రవి, జేఈ సుబ్రమణ్యం మండలంలోని టీఏ లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- ట్రాఫిక్ డీఎస్పీ తిప్పేస్వామి



మాట్లాడుతున్న ట్రాఫిక్ డీఎస్పీ తిప్పేస్వామి

చిత్తూరు రూరల్: డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ట్రాఫిక్ డీఎస్పీ తిప్పేస్వామి అన్నారు. చిత్తూరు–2 డిపోలో గురువారం రోడ్డు భద్రతా వారోత్సవాలు ముగిశాయి. ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ డీఎస్పీ మాట్లాడారు. డ్రైవర్ల తప్పిదాల వల్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఏకాగ్రతతో డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదన్నారు. డీపీటీఓ జితేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్టీసీకి డ్రైవర్లే చాలా కీలకమన్నారు. డ్యూటీ సమయంలో రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. అలాగే ఆర్టీసీకి ఇంధన పొదుపు అత్యంత ముఖ్యమన్నారు. జాగ్రత్తగా బస్సులు నడిపి ప్రమాద రహిత డిపోగా పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐ రాజేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గుణశేఖర్, డిపో అధికారులు పాల్గొన్నారు.

కారు సహా కర్ణాటక మద్యం స్వాధీనం

- నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న సెబ్ పోలీసులు

చిత్తూరు అర్బన్ : కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సెబ్ అర్బన్ సీఐ జోగేంద్ర తెలిపారు. ఆయన కథనం.. గురువారం నగరంలోని దుర్గానగర్ కాలనీలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో తులసీరామ్ అనే అతను తన కారులో అక్రమంగామద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. రూ.60 వేలు విలువ చేసే 1152 కర్ణాటక మద్యం ప్యాకెట్లతోపాటు కారును సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

గుడిపాల: కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చిత్తూరు సీఎంసీ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్ అన్నారు. గుడిపాలలోని సీఎస్ఆర్ కళాశాలలో గురువారం కేన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి ఏటా ఫిబ్రవరి 4న ప్రపంచ కేన్సర్ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కేన్సర్ వ్యాధి వంశపారపర్యంగా వచ్చే అవకాశం ఉందన్నారు. మద్యపానం, ధూమపానం చేసేవారికి ఎక్కువగా లంగ్స్, లివర్ కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. తొలి దశలోనే కేన్సర్‌ను గుర్తిస్తే చికిత్సతో వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చన్నారు. అధ్యాపకురాలు అన్నై ఎలిజబెత్ మాట్లాడుతూ, దేశంలో ప్రతి వెయ్యి మంది స్త్రీలలో 105 మంది బ్రెస్ట్ కేన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. అమెరికన్ కేన్సర్ అసోసియేషన్ పరిశోధనలో 20 ఏళ్లు దాటిన మహిళలు బ్రెస్ట్ కేన్సర్ పరీక్షలు చేసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు లోకేష్, ప్రిన్సిపల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, అధ్యాపకులు వేదవతి, జ్యోత్స్న, పేష, రీనా, కస్తూరి పాల్గొన్నారు.